సాక్షి ప్రకాశం

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



ఈ తీరు కర్రక్టేనా?

సమన్వయలోపం కారణంగా టంగుటూరు, సింగరాయకొండలో 19 ఎకరాల జామాయిల్ తోటలు 27 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. కొండపి మార్కెట్ యార్డుకు రూ.కోటికిపైగా నష్టం వాటిల్లింది.

- 8లో..



స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డుల పంపిణీ

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ జిల్లా స్థాయి అవార్డులను గురువారం సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు డైట్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35.5/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.



వైద్యసిబ్బందికి చట్టబద్ధమైన భద్రత కల్పించాలి

వైద్యసిబ్బందికి చట్టబద్ధమైన భద్రత కల్పించాలి. రాత్రనక, పగలనక వైద్యసేవలందిస్తూ ఎందరో మహిళలు ఎక్కువ సమయం ఆస్పత్రుల్లోనే ఉంటున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. అలాంటి వారి భద్రతకు భరోసా లేకుండా పోయింది. కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. ముఖ్యంగా రాత్రివేళ విధులు నిర్వహించే వారిపై దాడులు జరగకుండా ఉండేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ రవితేజ్‌కుమార్, ప్రభుత్వ వైద్యాధికారి, కురిచేడు



పనిచేసేచోట దారుణాలు జరగడం శోచనీయం

పని ప్రదేశాలలో మహిళలపై దారుణాలు జరగడం శోచనీయం. కోల్‌కతాలో డ్యూటీ డాక్టర్‌పై హత్యాచారం వంటి ఘటనలు మళ్లీమళ్లీ జరగకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలి. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే సిబ్బందికి, డాక్టర్లకు రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉంది. కోల్‌కతా ఘటనలో నిందితులకు కఠినమైన శిక్షలు పడేలా చూడాలి. అప్పుడే అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

– డాక్టర్ వినీల చౌదరి, మద్దిపాడు పీహెచ్‌సీ

న్యూస్‌రీల్

842 మందికి పింఛన్ల కోత.?

ఒంగోలు టౌన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో కోత మొదలైనట్లు తెలుస్తోంది. గత నెల 29వ తేదీ డీఆర్‌డీఏ పీడీ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆగస్టు నెలకు సంబంధించి 2,91,419 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే, సెప్టెంబర్ నెలకు సంబంధించి 2,89,096 మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఏఆర్‌టీ పింఛన్లను ప్రస్తావించలేదు. జూలైలో ఇచ్చిన ప్రకటన ప్రకారం.. 1,481 ఏఆర్‌టీ పింఛన్లు తీసేసి లెక్కించినా.. ఇంకా 842 పింఛన్లకు కోతవేసినట్లు తెలుస్తోంది. ఈ 842 మందికి పింఛన్లు ఎందుకివ్వడం లేదో తెలియని పరిస్థితి. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా పింఛన్లలో ప్రభుత్వం కోతపెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే పింఛన్ల యాప్‌లో తొలగింపు ఆప్షన్ కూడా ఇచ్చారు. కోత కోయడంలో భాగంగానే 842 పింఛన్లు తొలగించారా.. లేక మరేదైనా కారణమా..? అనేది తేలాల్సి ఉంది. దీనిపై వివరణ కోరేందుకు డీఆర్‌డీఏ పీడీ వసుంధరకు ఫోన్ చేయగా, ఆమె అందుబాటులోకి రాలేదు.

రేపటి నుంచే పింఛన్ల పంపిణీ...

సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగా ఆగస్టు 31వ తేదీ శనివారమే పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 6 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజే 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని, మిగిలిన వారికి సెప్టెంబర్ 2వ తేదీ ఇవ్వాలని ఉద్యోగులకు ఆమె సూచించారు.

1 నుంచి స్వచ్ఛత పఖ్వాడా

ఒంగోలు: సెప్టెంబర్ 1వ తేదీ నుంచి స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.సుభద్ర జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 1న ప్రతిజ్ఞ, 2న తల్లిదండ్రుల సమావేశం, 3న పారిశుధ్యంపై జాగ్రత్తలు, 4న గ్రామాల సందర్శన, 6న నీటి సంరక్షణ, 7న పరిశుభ్రతపై పోటీలు, 9న చేతుల శుభ్రత, 11న వ్యక్తిగత శుభ్రత, 12న స్వచ్ఛత పఖ్వాడా ఎగ్జిబిషన్, 13, 14 తేదీల్లో భవిష్యత్తు ప్రణాళిక, 15న బహుమతుల ప్రధానోత్సవాలు నిర్వహించాలని వివరించారు.

మార్కాపురం, కనిగిరి మున్సిపల్ కమిషనర్లు బదిలీ

మార్కాపురం టౌన్/కనిగిరి: జిల్లాలోని మార్కాపురం, కనిగిరి మున్సిపాలిటీల కమిషనర్లను బదిలీ చేసి కొత్త వారిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్కాపురం కమిషనర్‌గా పనిచేస్తున్న కిరణ్‌ను హోంశాఖకు బదిలీ చేశారు. నూతన కమిషనర్‌గా డీవీఎస్ నారాయణ రావును నియమించారు. నారాయణరావు ప్రస్తుతం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. అదేవిధంగా కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా కొవ్వూరు కమిషనర్‌గా పనిచేస్తున్న డానియేల్ జోసఫ్ నియమితులయ్యారు. ప్రస్తుత కనిగిరి కమిషనర్ టీవీ రంగారావును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న రవీంద్రను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో పి.శ్రీనివాసులును నియమించారు.

■ బదిలీలలు

కాసులకొద్దీ పోస్టు..!



- జిల్లాలో ప్రహసనంగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ
- కూటమి నేతలకు కాసుల పంటగా బదిలీలు
- ఎమ్మెల్యే, మంత్రుల సిఫార్సు లేఖలు తప్పనిసరి
- ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారులు, ఉద్యోగుల ప్రదక్షిణలు
- కోరుకున్న స్థానం కావాలంటే ముడుపులు చెల్లించాల్సిందే
- పైరవీల్లో ద్వితీయ శ్రేణి నేతల హడావిడి

ఒంగోలు అర్బన్: జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న బదిలీలు అధికార పార్టీల నేతలకు కాసుల పంట కురిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు మాసాలకు 15 ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీలు అధికార పార్టీ నేతలకు వరంలా మారాయి. అధికారులు, ఉద్యోగుల సాధారణ బదిలీలకు సైతం పరోక్షంగా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సిఫార్సులు తప్పనిసరయ్యాయి. కోరుకున్న స్థానాలకు వెళ్లాలంటే మాత్రం చేతులు తడపాల్సిందే. ఇదే మంచి తరుణం అంటూ కూటమి ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు రెచ్చిపోతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఇప్పిస్తామంటూ పైరవీలకు తెరతీస్తున్నారు. పోస్టింగ్‌ను బట్టి రేట్లను నిర్ధారిస్తూ ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ విషయాలు ప్రజాప్రతినిధులకు తెలిసినా మావాళ్లేగా.. సంపాదించుకోనీ..! అన్నట్లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులతో నేరుగా పరిచయమున్న అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారు జిల్లాకు రావాలంటే రూ.లక్షల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదిలా ఉండగా, పారదర్శకంగా బదిలీల ప్రక్రియ నిర్వహించాల్సిన జిల్లా అధికారులు సైతం ఎమ్మెల్యే సిఫార్సు లేనిదే బదిలీలు చేపట్టేందుకు వెనకడుగు వేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. జిల్లాలో జరుగుతున్న బదిలీల తంతును పరిశీలిస్తే ఎమ్మెల్యే సిఫార్సుకు ఉన్న విలువ అవగతమవుతోంది.

ఎవరికి వారే యమునా తీరే...

జిల్లా స్థాయి అధికారుల విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకరు మంచివారని సిఫార్సు చేస్తే..మరొకరు అడ్డుపుల్ల వేస్తున్నారు. ఎవరికి వారే మంచి చెడులను నిర్ధారిస్తున్నారు. జిల్లాకు రావాలని కోరుకుంటున్న వారితో మంత్రులు, ఎమ్మెల్యేలు విడివిడిగా బేరాలు కుదుర్చుకోవడం వలనే ఈ పరిస్థితి తలెత్తిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదిలా ఉండగా, జిల్లాలోని వివిధ శాఖల్లో 15 మంది జిల్లా స్థాయి అధికారుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మరో ఇద్దరు జిల్లా అధికారులు ఈ నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో మొత్తం 17 జిల్లా అధికారుల పోస్టులు ఖాళీగా ఉంటాయి. పంచాయతీరాజ్‌శాఖలో జెడ్పీ సీఈఓ, పంచాయతీరాజ్ ఎస్ఈ, డీపీఓ, వ్యవసాయ శాఖలో ఆత్మ పీడీ, డీఎంఅండ్‌హెచ్ఓ, బీసీ కార్పొరేషన్ ఈడీ, విద్యా శాఖలో అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ, సమగ్ర శిక్షలో అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌లో రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ (ఆర్ఐఓ), డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఓ), యూత్ వెల్ఫేర్‌లో స్టెప్ సీఈఓ, పరిశ్రమల శాఖకు సంబంధించి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర శాఖల అధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఈ నెలాఖరుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు ఉద్యోగ విరమణ పొందనున్నారు. జిల్లా అధికారుల నియామకంలో అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా విద్యుత్, మైనింగ్, జెడ్పీ సీఈఓ, డీపీఓ, రవాణా, తదితర శాఖల్లో అధికారుల పోస్టుల విషయంలో భేదాభిప్రాయాలు తలెత్తుతున్నట్టు సమాచారం. దీంతో జిల్లా అధికారుల నియామకంపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాకు వస్తే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయోనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని ముఖ్యమైన శాఖల్లో రాజకీయ జోక్యం లేకుండా పనిచేసే అధికారులను నియమించుకోవాలని కలెక్టర్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

రేపటితో ముగియనున్న బదిలీల ప్రక్రియ

ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. శనివారంతో గడువు ముగుస్తోంది. ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి కావడంతో వారంతా ఎమ్మెల్యే ఆశీసులు పొంది కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, సచివాలయాలు, రిజిస్ట్రేషన్, దేవదాయ, పరిశ్రమలు, పౌరసరఫరాలు, అన్నీ శాఖల్లోని ఇంజినీరింగ్ విభాగాల్లోని అధికారులు, ఉద్యోగులు సుమారు 10 వేల మందికిపైగానే ఉన్నారు. వీరిలో వందల సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు బదిలీ కానున్నారు. ఇప్పటికే జిల్లాలో మండల తహసీల్దార్ల నియామకాలు పూర్తి కాగా, ఇతర శాఖల్లో ప్రక్రియ జరుగుతోంది.

ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్‌కు తప్పని తిప్పలు...

బదిలీల్లో ఉద్యోగ సంఘాలకు సంబంధించిన ఆఫీస్ బేరర్స్‌కు మినహాయింపు ఉంటుంది. తాజాగా చేపట్టిన బదిలీల్లో ఆఫీస్ బేరర్ ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపాలనే నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం పెట్టింది. దీంతో కలెక్టర్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించే ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. కొన్ని యూనియన్లకు సంబంధించిన ప్రతిపాదనలు స్వీకరించగా, మరికొన్ని సంఘాల ప్రతిపాదనలు తోసిపుచ్చుతున్నట్లు ఉద్యోగ సంఘాలు తెలిపాయి. అంతేకాకుండా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు సంబంధిత శాఖల జిల్లా అధికారులకు అందకపోతే పరిస్థితి ఏంటనే దానిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలలకు అండగా నిలబడాలి

- బాలల హక్కుల కార్యకర్త, నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి

ఒంగోలు టౌన్: బాలబాలికలను స్వేచ్ఛగా ఎదగనీయాలని, వారికి అండగా నిలబడి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని బాలల హక్కుల కార్యకర్త, నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి పిలుపునిచ్చారు. నిరాదరణకు గురైన బాలబాలికల భవిష్యత్తు కోసం పాటుపడాలని కోరారు. ఒంగోలులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో బంగారు బాల్యం పేరుతో బాలల హక్కులపై గురువారం నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి బిడ్డను సురక్షితంగా, ఆరోగ్యంగా, విద్యావంతులుగా తీర్చిదిద్దడమే కాకుండా బాలల రక్షణ, పిల్లల హక్కుల పరిరక్షణకు తోడ్పాటునందించాలని చెప్పారు. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని బాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బంగారు బాల్యం కార్యక్రమాన్ని రూపొందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియాను అభినందించారు. గొప్ప సదాశయంతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. బంగారు బాల్యం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతిఒక్కరూ నిబద్ధతగా కృషి చేయాలని సూచించారు. జీవితంలో ఎదగాలంటే చదువు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. చిన్నారులంతా చదువుకునేలా చూస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారన్నారు.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ నిత్యం సామాజిక మాధ్యమాలలో వస్తున్న సంఘటనలను చూసి బంగారు బాల్యం కార్యక్రమానికి కలెక్టర్ రూపకల్పన చేయడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమ్మిళితం చేసి ఆ ఫలాలను నిరాదరణకు గురైన బాలలకు అందించాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. రోజురోజుకూ సమాజంలో లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, కారణమేదైనా బాలలను విద్యావంతులను చేయడం ద్వారా వీటిని అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నం చేయాల్సి ఉందని అన్నారు. బాలికలను విద్యావంతులను చేయడానికి పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వం నడుపుతోందన్నారు. త్వరలో సింగరాయకొండలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురైన బాలలకు మంచి భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో బంగారు బాల్యం అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. జిల్లాలోని 0 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలందరినీ ఆరోగ్యంగా, సురక్షితంగా సాధికారితతో తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లేలా చేయడం, వారికి తగిన గుర్తింపు ఇవ్వడం, వారి హక్కులను కాపాడటం మనందరి బాధ్యతని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. తొలుత కై లాష్ సత్యార్థి కలెక్టర్ కార్యాలయానికి రాగా, కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆయనను స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం బంగారు బాల్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. జేసీ గోపాలకృష్ణ, ఐసీడీఎస్ పీడీ మాధురి, చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రం ఉప సంచాలకులు రవికుమార్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా ఈ నెల 1 నుంచి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించి బడిలో చేర్పించిన పలువురు చిన్నారులను సన్మానించారు.



బంగారు బాల్యం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి

ఎయిడ్స్ నిర్మూలనే లక్ష్యం

- ప్రజలకు అవగాహన కల్పించడమే ధ్యేయం
- అందులో భాగంగానే 5కే రెడ్ రన్ నిర్వహణ
- జిల్లా ప్రోగ్రాం మేనేజర్ కిరణ్‌కుమార్
- ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు ప్రశంసపత్రాలు అందజేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి సమూల నిర్మూలనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నామని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.కిరణ్ కుమార్ అన్నారు. వ్యాధి సమూల నిర్మూలనలో భాగంగా గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థలు సంయుక్తంగా వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. అందులో భాగంగా స్థానిక ప్రకాశం భవనం వద్ద నుంచి ఒంగోలు దక్షిణ బైపాస్ వరకు, తిరిగి అక్కడి నుంచి ప్రకాశం భవనం వరకు 5కే రెడ్ రన్ నిర్వహించారు. 5కే రన్‌లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా స్థానిక జీజీహెచ్ ఆడిటోరియంలో ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధికి ప్రజలెవరూ గురికాకుండా చూసేందుకు విస్తృత ప్రచారం చేపట్టామన్నారు. యువతీ, యువకులతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి వ్యాధి బారిన పడకుండా చూసేందుకు మారథాన్ 5కే రెడ్ రన్ లాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వ్యాధి ఎలా సోకుతుంది, సోకకుండా ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలనే విషయాలను ప్రజలకు వివరిస్తున్నామని వెల్లడించారు. ఒకవేళ వ్యాధి సోకితే.. వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రభుత్వం అలాంటి వారికి ఎలాంటి వైద్య సేవలు అందిస్తోంది లాంటి అంశాలను పూర్తిగా విశదీకరిస్తున్నామని పేర్కొన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి 8 వారాల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 'మీకు తెలుసా' అనే ఐఈసీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో లింక్ వర్కర్స్ రిసోర్స్‌పర్సన్ జి.స్వరూప్ కుమార్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి రాజేశ్వరి, డీఐసీ సూపర్‌వైజర్ చంద్రమోహన్, గ్రాండ్ గ్రో, నినార్డ్, మదర్ ల్యాండ్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్లు కోటేశ్వరరావు, ఎస్కే పీర్ బాషా, సునీల్, డి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



5కే రన్‌లో ప్రతిభ చూపిన బాలబాలికలకు ప్రశంస పత్రాలు అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఇదేనా.. 'బంగారు బాల్యం'..?



ప్రకాశం భవనం ముందు 5కే రన్ కోసం వేచి ఉన్న వారి వద్దకు వచ్చి యాచిస్తున్న ఓ బాలుడు

ఒంగోలు సబర్బన్:

'పేరు గొప్ప..ఊరు దిబ్బ' అన్న చందంగా ఉంది జిల్లా కేంద్రంలో అధికార యంత్రాంగం పనితీరు. ఆర్భాటపు ప్రచారాలు మినహా ఆచరణ కనిపించడం లేదు. ఈ విషయంలో సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకున్నట్లున్నారు జిల్లా అధికారులు. చెప్పేది కొండంత ఉండగా, చేసేది గోరంత కూడా కనిపించడం లేదు. ఒంగోలు నగరంలో గురువారం జరిగిన సంఘటనలు అందుకు నిదర్శనంగా ఉన్నాయి. బాలల హక్కులపై 'బంగారు బాల్యం' అనే పేరుతో ప్రత్యేక వర్క్‌షాప్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో స్థానిక జీజీహెచ్ ఆడిటోరియంలో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాలల హక్కుల కార్యకర్త, నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థిని ఆహ్వానించారు. అంత గొప్ప వ్యక్తిని ఒంగోలుకు ఆహ్వానించి బాలల హక్కులపై కార్యక్రమం నిర్వహించడం మంచి విషయమే అయినప్పటికీ.. అదే సమయంలో వీధుల వెంట భిక్షాటన చేస్తున్న బాలల గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం పనీతీరు మాదిరిగానే అధికారుల పనితీరు కూడా ఉందని చెప్పకనే చెబుతున్నట్లయింది. బంగారు బాల్యం వర్క్‌షాప్‌లో కైలాష్ సత్యార్థితో పాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ పాల్గొని బాలల సంక్షేమం గురించి గొప్పగా ప్రసంగించారు. బాలల బంగారు భవిష్యత్తు 100 శాతం సాధన దిశగా ప్రకాశం జిల్లా... అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. అదే సమయంలో ఒంగోలు నగరంలో అనేక చోట్ల పలువురు బాలలు యాచిస్తూ తారసపడ్డారు. ఒకవైపు బంగారు బాల్యం కార్యక్రమం జరుగుతూ కైలాష్ సత్యార్థి నగరంలో ఉండగానే.. పలు ప్రధాన కూడళ్లలో ముక్కుపచ్చలారని చిన్నారులు రోదిస్తూ భిక్షాటన చేయడం ప్రజలను కలచివేసింది. సాక్షాత్తూ కలెక్టరేట్ ఎదురుగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కోసం గురువారం నిర్వహించిన 5కే రెడ్ రన్ కార్యక్రమం వద్దకు ఒక బాలుడు వచ్చి యాచించడం పలువురిని ఆవేదనకు గురిచేసింది. బాలల కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి నోబెల్ బహుమతి గ్రహీతను ఆహ్వానించిన కలెక్టర్, జిల్లా అధికారులు.. నగరంలో వీధుల వెంట తిరుగుతూ భిక్షాటన చేస్తున్న చిన్నారుల గురించి కనీసం ఆలోచించకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఇకనైనా ఆర్భాటపు ప్రచారాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఆచరించడంపై దృష్టి సారించాలని ప్రజలు హితవు పలుకుతున్నారు.

చిరస్మరణీయులు.. గిడుగు రామ్మూర్తి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- గిడుగు జయంతి సందర్భంగా ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఒంగోలు అర్బన్: వ్యవహారిక తెలుగు భాషకు తగిన ప్రాముఖ్యత వచ్చేలా, తెలుగు భాషకు పెద్ద పీట వేసేలా కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి చిరస్మరణీయులని కలెక్టర్ తమీమ్ అన్సారియా కొనియాడారు. గిడుగు రామ్మూర్తి 162వ జయంతిని పురస్కరించుకుని గురువారం ప్రకాశం భవనంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేసీ గోపాలకృష్ణతో కలిసి పాల్గొన్న కలెక్టర్.. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాంధికంలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చేందుకు సంస్కర్త గిడుగు రామ్మూర్తి చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమానికి ఆయన మూలపురుషుడని, ఆయన జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. బహుభాషావేత్తగా, చరిత్రకారునిగా, సంఘ సంస్కర్తగా గిడుగు చేసిన సేవలను కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్ఓ విశ్వేశ్వరరావు, డీఈఓ సుభద్ర, డిప్యూటీ డీఈఓ అనితారోజ్, కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి

ఒంగోలు సెంట్రల్: ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచుకొని జిల్లాలో మరింత ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్పందన హాలులో ప్రకృతి వ్యవసాయంపై ఏడీఏలు, వ్యవసాయాధికారులు, ఉద్యానవన శాఖాధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ప్రకృతి వ్యవసాయంలో ఉన్న శాస్త్రీయత, రాష్ట్రస్థాయిలో శిక్షణలో చెప్పిన అంశాలను వివరించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చాలా బాగా చేస్తున్నారని, ఇంకా ప్రోత్సహించాల్సిన ఆవశ్యతకను వివరించారు. అంతర పంటలు, ఏటీఎం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఏటీఎం మోడల్స్‌లో రైతులు పాటిస్తున్న పద్ధతులను పరిశీలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతి చెందిన చిన్న దిబ్బారెడ్డి(ఫైల్)

అర్ధవీడు(బేస్తవారిపేట): అప్పుల బాధతో ఓ రైతు అర్ధంతరంగా తనువు చాలించాడు. పంటల సాగుకు పెట్టుబడి కోసం చేసిన అప్పు అధికమై తీర్చే మార్గం కానరాక బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశాడు. ఈ సంఘటన అర్ధవీడు మండలంలోని కాకర్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతుల సానికొమ్ము చిన్న దిబ్బారెడ్డి(45) తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో పది ఎకరాల భూమి కౌలుకు తీసుకున్నాడు. పత్తి, మిరప పంటలు సాగు చేసి అప్పులపాలయ్యాడు. ఒక వైపున అప్పు తీర్చేదారిలేక, పిల్లల చదువులకు డబ్బులు లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య రమణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.అనిత తెలిపారు.

ప్రతిపాదన స్థాయిలోనే ఫిషింగ్ హార్బర్

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

కొత్తపట్నం: కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు ప్రతిపాదన స్థాయిలోనే ఉందని, ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. కొత్తపట్నం కె.పల్లెపాలెంలోని బృందావన్ గార్డెన్‌లో గురువారం కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ అథారిటీ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పొల్యూషన్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్‌కి సంబంధించి 2011 తరువాత కొన్ని మార్పులు చేసి 2019లో నోటిఫికేషన్ చేశారన్నారు. జిల్లాలోని 8 మండలాల్లో 15 రోజుల క్రితమే తహసీల్దార్లకు ప్రజాభిప్రాయ సేకరణపై ప్రచారం చేయించామన్నారు. సీఆర్‌జెడ్ పరిధిలో తగ్గించడం, పెంచడం చేయలేదని, యథావిధిగా ఉందని తెలిపారు. తీరం వెంట చెన్నై బోట్లు సముద్ర వేట కొనసాగించే విషయంపై ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్బారెడ్డి, పొల్యూషన్ బోర్డు ఏఈ భాస్కర్‌వర్మ, తహసీల్దార్ పిన్నెల మధుసూదన్‌రావు, ఆర్‌ఐ రవికుమార్, పొల్యూషన్ బోర్డు అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు. అయితే కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై మత్స్యకారులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల నుంచి హాజరు కాకపోవడంతో తక్కువ జనంతో సమావేశాన్ని ముగించారు.

పొగాకు గరిష్ట ధర రూ.359

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో గురువారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.359 పలికింది. ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో 11,542 బేళ్లు వేలానికి రాగా, 9,692 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 143వ రోజు నిర్వహించిన వేలానికి 5,898 బేళ్లు రాగా, 4,954 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.195, సరాసరి ధర రూ.302.66 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 137వ రోజు నిర్వహించిన వేలానికి 5,644 బేళ్లు రాగా, 4,738 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.193, సరాసరి రూ.295.291 పలికింది.

వైద్యుల రక్షణకు పటిష్ట చట్టాలు అవసరం




వైద్యులకు, వైద్యారోగ్య శాఖ సిబ్బందికి రక్షణ కల్పించేందుకు పటిష్ట చట్టాలు రూపొందించాలి. లేదంటే విధులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం కష్టం. వైద్యశాలల్లో 24 గంటలు విధులు నిర్వర్తించే సమయంలో రాత్రిళ్లు ఇబ్బందులు తలెత్తుతుంటాయి. కనుక తప్పనిసరిగా భద్రత ఉండాలి. ఆపద సమయంలో సత్వర సాయం అందేలా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. మహిళా డాక్టర్లలో ఆత్మవిశ్వాసం పెరగాలంటే సమాజం నుంచి కూడా మద్దతు అవసరం.

– డాక్టర్ కె.సురేఖ, కొనకనమిట్ల, పీహెచ్‌సీ



ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి. మహిళా వైద్యులకు వాష్‌రూంలు, డ్రెస్ చేంజింగ్ రూమ్‌లు లేవు. వసతులు బాగుంటే వైద్యులు మరింత సమయం అక్కడే ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించగలుగుతారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులను అదుపు చేయడానికి సెక్యూరిటీ అసవసరం. ఆస్పత్రులల్లో పూర్తి స్థాయి నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో విధులకు హాజరైతే ఎప్పుడు ఏం జరుగుతుందో నన్న భయాందోళనను మహిళా సిబ్బందిలో పోగొట్టేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి.

– ఏకూరి సురేష్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు

ఈ తీరు కర్రక్కేనా?



- టంగుటూరు, సింగరాయకొండలో ఎండుముఖం పడుతున్న జామాయిల్ తోటలు
- ఆనాటి టీడీపీ పాలకవర్గ సభ్యులు, అధికారుల మధ్య సమన్వయ లోపం
- 19 ఎకరాల్లోని తోటలను 27 ఏళ్లుగా పట్టించుకోకుండా వదిలేసిన వైనం
- కొండపి మార్కెట్ యార్డుకు రూ.కోటికి పైగా నష్టం

టంగుటూరు: ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కొండపి వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు, పాలకవర్గం మాజీ సభ్యుల వ్యవహార శైలితో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన టంగుటూరు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం సమీపంలో కొండపి మార్కెట్ యార్డుకు సంబంధించి 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీని చుట్టూ ప్రహరీ నిర్మించి ప్రజా పంపిణీ వ్యవస్థ గోడౌన్ నిర్మించారు. మిగిలిన ఖాళీ భూమిలో 1995 నవంబర్‌లో సామాజిక అటవీ శాఖ ఉచితంగా అందించిన 32 వేల జామాయిల్ మొక్కలు నాటారు. వ్యవసాయ భూమి చుట్టూ రక్షణ గోడ ఉండటం, వాతావరణం కూడా అనుకూలించడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. ఇదిలా ఉండగా మార్కెట్ యార్డుకు సంబంధించి సింగరాయకొండలో నాలుగు ఎకరాల భూమి ఉండగా అందులోనూ 27 ఏళ్ల క్రితం సామాజిక అటవీ శాఖ సహకారంతో జాయాయిల్ మొక్కలు నాటారు. ఆనాటి టీడీపీ పాలకవర్గ సభ్యులు, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా తోట గురించి పట్టించుకున్న నాథుడే లేరు.

నష్టం రూ.కోటికి పైమాటే..

జామాయిల్ తోటలు సాధారణంగా ప్రతి నాలుగేళ్లకు ఒకసారి కొట్టుడుకు వస్తాయి. ఎకరానికి 30 టన్నుల కర్ర దిగుబడి వస్తుంది. మార్కెట్ యార్డుకు సంబంధించి మొత్తం 19(15 + 4) ఎకరాలకు గాను సుమారు 570 నుంచి 600 టన్నుల కర్ర వచ్చే అవకాశం ఉంది. గతంలో సరాసరి టన్ను ధర రూ.2200 వరకు పలకగా 19 ఎకరాలకుగాను ఒక్కో దఫా రూ.18 లక్షల ఆదాయం వచ్చేది. 25 ఏళ్లలో ఆరు సార్లు కర్ర నరకకుండా వదిలేయడం వల్ల సుమారు రూ.1.20 కోట్లకుపైగా ఆదాయాన్ని మార్కెట్ యార్డు కోల్పోయింది.


టంగుటూరులో భారీగా పెరిగిన జాయాయిల్ తోట

ఎండిపోతున్న చెట్లు

25 ఏళ్లుగా జామాయిల్ తోటలను వదిలేయడంతో చెట్లు భారీగా పెరిగాయి. జామాయిల్ తోటలను కొట్టేందుకు యార్డు అధికారులు, మాజీ పాలకవర్గ సభ్యులు, అధికారులు పలుమార్లు విఫలయత్నం చెందారు. నేరుగా వేలం జరపాలన్న అధికారుల విధానాన్ని అప్పట్లో కొందరు ప్రజా ప్రతినిధులు వ్యతిరేకించారు. మద్దతు ధర, టన్నుల లెక్కన నేరుగా తోటలు కొట్టించాలని ప్రయత్నించినా ఆచరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో వందలాది చెట్లు ఎండిపోయాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

టంగుటూరు, సింగరాయకొండలోని 19 ఎకరాల్లో ఉన్న జామాయిల్ , సూబాబుల్ చెట్లు కొట్టడానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా అనుమతి రాలేదు. మరోసారి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. వారు ఆమోదిస్తే చెట్లు కొట్టించి పెట్రోల్ బంకు, ఇతరత్ర నిర్మాణాల ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

– మాధవరావు, మార్కెట్ యార్డు కార్యదర్శి

అక్రమంగా నరికివేత

టంగుటూరు చుట్టుపక్కల ప్రజలు, రొయ్యల ఫ్యాక్టరీల్లో కూలీ పనులకు వచ్చిన ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు రోజూ మార్కెటు యార్డులోని చెట్లను నరికి తీసుకుపోతున్నారు. అలాగే గొర్రెలు, మేకల పెంపకందారులు చెట్ల ఆకులు రెలిపి, పనిలో పనిగా కర్ర కూడా తీసుకెళ్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం కాపలాగా గార్డును కూడా నియమించలేదు.

జామాయిల్ తోటలు కొట్టించాలి



టంగుటూరు, సింగరాయకొండలోని మార్కెట్ యార్డు భూముల్లో జామాయిల్ , సూబాబుల్ చెట్లను కొట్టించాలి. అలాగే వదిలేయడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఎవరుపడితే వారు తోటల్లోకి ప్రవేశించి కర్ర నరికి తీసుకెళ్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– చింతపల్లి హరిబాబు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్

మోదీ పాలనలో బతుకులు దీనం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు విజయ రాఘవన్


మాట్లాడుతున్న విజయ రాఘవన్

ఒంగోలు టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో దేశంలోని వ్యవసాయ కార్మికుల బతుకులు దీనంగా మారాయని, రెక్కాడితేకానీ డొక్కాడని రైతు కూలీలు మరింత పేదరికంలో కూరుకుపోయారని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు విజయ రాఘవన్ విమర్శించారు. గురువారం ఒంగోలు నగరంలోని కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అరకొర మెజారిటీతో మోదీ మూడోసారి ప్రభుత్వంలోకి వచ్చినా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం మానలేదన్నారు. ఎన్డీఏ 10 ఏళ్ల పాలనలో వ్యవసాయ రంగంతోపాటు ఉత్పత్తి రంగాల్లో సంక్షోభాలు కొనసాగుతున్నాయన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేదల బతుకులు ఛిద్రం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో పేదల జీవన ప్రమాణాలు తగ్గుముఖం పట్టాయన్నారు. పేదరిక నిర్మూలన, విద్యా వైద్యం, పౌష్టికాహార లోపం వంటి అంశాలకు నిధుల కేటాయింపు తగ్గడంతో పిల్లలు, మహిళల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్న మోదీ దేశంలో పేదరికం, నిరుద్యోగాన్ని తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో వామపక్షాల మద్దతుతో తెచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కూడా నిర్వీర్యం చేస్తున్నారని, కనీస వేతనం, పనిదినాల కోసం పోరాడాల్సిన దుస్థితి వచ్చిందని చెప్పారు. 24 కోట్ల మంది ఆధారపడిన ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు గ్రామీణ స్థాయిలోనే వ్యవసాయ కార్మికులు దళాలుగా ఏర్పాటై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో ఏర్పడిన సంక్షోభం కారణంగా అనేక మంది ఇతర రంగాలకు వలస పోతున్నారని, ఈ పరిస్థితులపై అధ్యయనం చేసి తగిన పరిష్కారం కొనుగొనాలని సూచించారు. సమావేశానికి దద్దాల సుబ్బారావు అధ్యక్షత వహించగా కంకణాల ఆంజనేయులు, బి.వెంకట్, వి.వెంకటేశ్వర్లు, వి.కృష్ణయ్య, ప్రభాకర్ రెడ్డి, జాలా అంజయ్య, నెరుసుల వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువకు కన్నం!

- కొణిజేడు గ్రామ టీడీపీ నాయకుడు రామా గోపి దుశ్చర్య
- దిగువ గ్రామమైన మర్లపాడుకు నీటి సరఫరా ఆపేసిన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు


కాలువకు గండిపెట్టి అనధికారికంగా కొణిజేడు గ్రామానికి నీరు తరలిస్తున్న దృశ్యం

టంగుటూరు: ఓ టీడీపీ నేత నిర్వాకం మరో గ్రామానికి నీటి కష్టాలు తెచ్చిపెట్టింది. వివరాల్లోకి వెళ్తే.. తాగునీటి చెరువులు నింపేందుకు ప్రభుత్వం ఇటీవల సాగర్ నీటిని విడుదల చేసింది. టంగుటూరు మండలంలోని చెరువులను ఈ నీటితో నింపాల్సి ఉంది. మర్లపాడు గ్రామంలోని తాగునీటి చెరువుకు చేరాల్సిన రామతీర్థం సాగర్ నీటిని కొణిజేడు గ్రామ టీడీపీ నాయకుడు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నాడు. కొండల మధ్య ఉన్న సాగర్ కాలువకు గండికొట్టి కొణిజేడు గ్రామ చెరువుకు తరలిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి అవసరానికి మించి చెరువుకు అనధికారికంగా నీరు నింపుతున్నారు. దీంతో మర్లపాడు గ్రామ ప్రజలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. మర్లపాడు చెరువుకు బుధవారం రాత్రి నీరు తరలిస్తుండగా టీడీపీ నేత రామా గోపి కాలువ కట్టను తెగ్గొట్టడంతో గ్రామస్తులు ప్రశ్నించారు. వారిపై గోపి దౌర్జన్యానికి దిగడమే కాకుండా అంతుచూస్తానని బెదిరించడం తీవ్ర చర్చనీయాంశమైంది. గత 15 రోజులుగా గోపి వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా ఉన్నా, అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని మర్లపాడు గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మర్లపాడు గ్రామానికి మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డుల పంపిణీ


అవార్డుకు ఎంపికైన హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులను సత్కరిస్తున్న జిల్లా కమిటీ

చీమకుర్తి: జిల్లా స్థాయిలో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డులను శుక్రవారం మైనంపాడు ప్రభుత్వ డైట్ కాలేజీలో అవార్డు గ్రహీతలకు అందించారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగాల్లో హైస్కూళ్లలో ప్రదర్శించిన ఉత్తమ నైపుణ్యత ఆధారంగా జిల్లాలో 5 హైస్కూళ్లను ఎంపిక చేశారు. సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దొనకొండ జిల్లాపరిషత్ హైస్కూలు, జరుగుమల్లి జిల్లాపరిషత్ హైస్కూలు, కనిగిరి మండలంలోని గురువాజీపేట జిల్లాపరిషత్ హైస్కూలు, సింగరాయకొండ మండలంలోని పాకల జిల్లాపరిషత్ హైస్కూళ్లను జిల్లా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైనట్లు సంతనూతలపాడు ఎంఈఓ వెంకారెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డుకు జిల్లాలోని హైస్కూళ్లలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించిన స్కూళ్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. గత ఏడాది నుంచి ఈ కార్యక్రమాన్ని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు ఇస్తునట్లు ఎంఈఓ తెలిపారు. అవార్డులకు ఎంపికైన ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలతో పాటు శాలువాలు కప్పి మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు, చీమకుర్తి ఎంఈఓలు వెంకారెడ్డి, డీవీఎల్ నరశింహరావు, డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాసరావు, డైట్ కాలేజీ లెక్చరర్ శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కె.వనజ పాల్గొన్నారు.

సీడీసీ డీన్‌కు అభినందనలు

ఒంగోలు: సీడీసీ డీన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏకేయూ ప్రొఫెసర్ సోమశేఖరను జిల్లాలోని పలు బీఈడీ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. యాలం వెంకటేశ్వరరావు, కేవీ రమణారెడ్డిలతోపాటు పలువురు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఎన్‌సీటీఈ లాగిన్ పేరు మార్పునకు వినతి


మాట్లాడుతున్న ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు: ఎన్‌సీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ అరోరాను గురువారం ఏకేయూ రిజిస్ట్రార్ బి.హరిబాబు కలిసి ఎన్‌సీటీఈ లాగిన్‌లో యూనివర్శిటీ పేరు మార్చాలని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం హైదరాబాదులో కలుసుకున్నారు. పలు కళాశాలలకు గుర్తింపు విషయంలో సాంకేతికంగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన వివరించారు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కాలేజీలు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పరిధిలో ఉండేవని, ఏడాదిరన్నర నుంచి అవన్నీ అధికారికంగా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి బదిలీ అయ్యాయన్నారు. కానీ ఎన్‌సీటీఈ లాగిన్ మాత్రం పాత పేరునే సూచిస్తుండటంతో తమ యూనివర్శిటీ పరిధిలో బీఈడీ, బీపీ ఈడీ, ఎంఈడీ, ఎంపీ ఈడీ కాలేజీల్లో చదువుతున్న ఇతర రాష్ట్రాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.

ప్రసవాల సంఖ్య మెరుగుపరచాలి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రసవాల సంఖ్య మెరుగుపరచాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్యాధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల సూపరింటెండెంట్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన తల్లి బిడ్డల సంరక్షణ లక్ష్యంగా వైద్య సేవలు అందించాలన్నారు. గిద్దలూరు, పామూరు, కంభం, యర్రగొండపాలెం సీహెచ్‌సీల్లో నిర్దేశించిన మేరకు ప్రసవాలు జరగడం లేదని మెరుగుపరచాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో సౌకర్యాలు సిబ్బంది కొరత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను అందజేయాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ శేషు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాటిపర్తి సుబ్బారెడ్డికి ఘన నివాళి


ఎస్పీ దామోదర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జంకె


తాటిపర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: కోల్ సొసైటీ మాజీ చైర్మన్ తాటిపర్తి సుబ్బారెడ్డికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఘన నివాళి అర్పించారు. గురువారం సుబ్బారెడ్డి నివాసానికి చేరుకుని ఆయన చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్పీ దామోదర్‌తో భేటీ

ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వైపాలెం ఆస్పత్రిలో టీడీపీ నేత పుట్టినరోజు


వైద్యశాలలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు ఇస్మాయిల్

యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలను పచ్చనేతలు టీడీపీ కార్యాలయంగా మార్చేశారు. రక్తదాన శిబిరం పేరుతో కేక్ కట్‌చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం వివాదాస్పదంగా మారింది. గురువారం టీడీపీ నాయకుడు షేక్ ఇస్మాయిల్ పుట్టిన రోజు సందర్భంగా ముస్లిం యూత్ సొసైటీ పేరుతో వైద్యశాలలో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ నాయకుడు గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ పార్టీ నాయకుడి జన్మదిన వేడుకలను వైద్యశాలలోనే జరిపారు. రోగుల పరిస్థితిని పక్కన పెట్టిన వైద్యులు జన్మదిన వేడుకల్లో పాల్గొని అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయం అయినప్పటికీ, కేక్ కటింగ్ కార్యక్రమాలను అనుమతించడం ఎంతవరకూ సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి హోదాలేని నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుడు ఇటీవల తన మంది మార్బలంతో వెళ్లి ఏరియా వైద్య శాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో కూడా ప్రభుత్వ వైద్యులు జీ హుజూర్ అంటూ ఆయనకు నమస్కరించి అధికార పార్టీపై ఉన్న తమ స్వామి భక్తిని చాటుకున్నారు.